విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

పారదర్శకంగా మొదటి దశ ఈవిఎం, ర్యాండమైజేషన్ పూర్తి

విశాలాంధ్ర-ఏలూరు: పారదర్శకంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ ఈవిఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులైన నెరుసు నెలరాజు(బిజెపి), ఎస్‌బి ప్రసాద్(కాంగ్రెస్), ఉండవల్లి బాలానందం(టిడిపి), డి. సూర్యచంద్రరావు(వైఎస్ఆర్ సిపి), ఎన్. కాశీనరేష్ (జనసేన) తదితరులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మొదటి దశ ర్యాండమై జేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఈవిఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామని అన్నారు. ఏలూరు జిల్లాలో 1743 పోలింగ్ స్టేషన్లకు గాను 4184 బ్యాలెట్ యూనిట్లు, 4184 కంట్రోల్ యూనిట్లు, 4534 వివిప్యాట్ లో అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు 20 శాతం, వివి ప్యాట్లు 30 శాతం అధనంగా కేటాయించడం జరుగుతుందని వీటిని కలిసి ర్యాండమైజేషన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, నోడల్ అధికారి కె.వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఏ పిడి ఆర్.విజయరాజు,తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

విశాలాంధ్ర-భీమవరం: మొదటి విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్దేశిత వెబ్‌సైట్‌లో పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఈ.యమ్.ఎస్-2.ఓ నిర్దేశిత వెబ్సైట్లో మొదటి విడత ఇవిఎంల ర్యాండమైజేషన్ పక్రియను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసినట్లు కలెక్టరు సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. ఈ ప్రక్రియలో జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఎన్నికల సూపరింటెండెంటు సి.హెచ్. దుర్గాప్రసాదు, డిప్యూటీ తహాశీల్దారు యం.సన్యాసి రావు, ఏడు నియోజకవర్గాల నోడల్ అధికారులు, టెక్నికల్ బృందం, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కామన నాగేశ్వరరావు, యండి జహంగీరు, మరపట్ల శ్యాంబాబు, కాటూరి కరుణాకర్, గొట్టుముక్కల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో నగదు సీజ్

విశాలాంధ్ర - గణపవరం: రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఉంగుటూరు నియోజకవర్గంలో అధికారులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారని ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్ కె.ఖాజావలి తెలిపారు. శుక్రవారం గణపవరం మండలం సరిపల్లె గ్రామంలో ఉన్న తనిఖీ చెక్ పోస్ట్ వద్ద స్టాటిక్ సర్వే లైన్స్ టీమ్ జరిపిన తనిఖీల్లో 1లక్ష 30వేల రూపాయలు నగదును టీమ్ సీజ్ చేశారని ఆయన తెలిపారు.

అభివృద్ధికి ఓటేద్దాం.. అవినీతి ప్రభుత్వాన్ని దింపేద్దాం

విశాలాంధ్ర-తణుకు: ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి కోసం మనమంతా ఆలోచించి ఓటు వేయాలని తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి ఆరిమిల్లి కృష్ణ తులసి పిలుపునిచ్చారు. తణుకు పట్టణంలోని 23, 26 వార్డులలో తెలుగుదేశం, జనసేన,బిజెపి కూటమి తరపున ఆమె శుక్రవారం ప్రచారం నిర్వహించారు. తణుకు నియోజకవర్గంలో కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లుగా అరాచక పాలన నెలకొందని అన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం ఇచ్చామని వైసిపి పాలకులు చెబుతున్నారని, కానీ చాలా చోట్ల ఇది అందడం లేదని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, టిడిపి జనసేన, బిజెపి పార్టీల నాయకులు కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య వర్ధంతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య వర్ధంతి సందర్భంగా బంధకట్టు సెక్షన్ నీటిపారుదల శాఖ కార్యాలయం వద్ద డీఈ రవీంద్రబాబు కార్యాలయ సిబ్బందితో కలిసి విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాక్షస పాలనను తరిమి కొట్టండి

విశాలాంధ్ర - కైకలూరు : రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రాక్షస పాలనను తరిమి కొట్టండి అని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బొమ్మన బోయన విజయ లక్ష్మి అన్నారు. కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ జన సేన బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్ట మహేష్ యాదవ్ ప్రచారంలో భాగంగా కైకలూరు పట్టణంలో 9వ వార్డు, 10వ వార్డులలో ఇంటింటికి తిరుగుతూ డాక్టర్ కామినేని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పి జె ఎస్ మాల్యాద్రి, మాజీ ఎంపీటీసీ పైడిమర్రి రాధాకృష్ణ,ఎనిమిదో వార్డు సభ్యుడు మేదూరి నాంచారయ్య,మంచి కంటి శ్రీనివాసరావు,జిల్లా తెలుగు యువత కార్యదర్శి చెక్క పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెం కాలేజీ దుస్థితి ఇంతేనా!

అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

విశాలాంధ్ర-లింగపాలెం : ధర్మాజీగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏడాదికి లక్షల వ్యయంతో నిర్వహిస్తున్న ఈ కాలేజిలో పదిమంది కూడా చదవటం లేదు. మొదటి సంవత్సరం ఇంటర్లో నలుగురు చదివితే ఇద్దరు మాత్రమే పరీక్షలు రాశారు. వీరిద్దరూ ఫెయిల్ అయ్యారు. రెండో సంవత్సరం ఇంటర్లో ఏడుగురు చదివితే ఒక్కరు మాత్రమే పరీక్ష రాశారు. పరీక్షలు రాసిన ఒక్క విద్యార్థి పరీక్ష తప్పాడు. దీనిపై ఈ కాలేజీకి పట్టిన దుస్థితి ఏంటంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ కాలేజీ నిర్వహణ కోసం ప్రతి ఏడాది ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నది. ఈ కాలేజీకి ఖర్చు పెట్టే నిధులన్నీ వృధా అవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో మొట్టమొదటిసారి 1988లో ధర్మాజీ గూడెంలో ఆడియో, వీడియో జూనియర్ కళాశాలను నెలకొల్పారు. దాదాపు 10 ఏళ్ల పాటు సక్రమంగానే కాలేజీలో విద్యాబోధన జరిగింది. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఈ కాలేజీ ప్రగతిని చూసి అప్పటిలో ప్రతి మండలంలో ఇటువంటి కాలేజీలను నెలకొల్పాలని ప్రభుత్వం భావించింది. పరిస్థితులు దానికి అనుగుణంగా లేకపోవడంతో ఈ ప్రయత్నాన్ని విరమించారు. ఉన్న ఈ ఒక్క ఆడియో, వీడియో కాలేజి రాను రాను ప్రగతిని కోల్పోతూ వచ్చింది. ఆడియో వీడియో కాలేజిని మార్చి 2005లో రెగ్యులర్ కళాశాలగా ఏర్పాటు చేశారు. ఈ కాలేజీ అభివృద్ధికి అప్పట్లో గ్రామస్తులు పూర్తి సహకారం అందించారు. కాలేజి ఏర్పాటుకు గ్రామానికి చెందిన ముసునూరు నాగేశ్వరరావు రూ.1 లక్ష విరాళంగా ఇచ్చారు. ఈ గ్రామంలో కాలేజీ ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతంలోని కళాశాల విద్య అందుబాటులో ఉంటుందని ఈయన ముందుకు వచ్చారు. ఈ కాలేజీ అభివృద్ధికి స్థానికులు తమ వంతు సహకారం అందించారు. కాలేజి కోసం స్థానికులు విరాళాలు సేకరించి మూడు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఇచ్చారు. ఈ స్థలంలో ఏడు గదులతో రెండు పక్కా భవనాలను నిర్మించారు. కానీ కాలేజీ సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయక పోవడంతో పేరుకే కాలేజిగా ఉంది. రెగ్యులర్ కాలేజీగా ఏర్పాటు చేసినప్పటికీ లెక్చరర్ లను నియమించకపోవటం వల్ల విద్యార్థులు కాలేజీలో చేరటం లేదు. చేరిన కొద్ది మంది విద్యార్థులకు పాఠాలు చెప్పే వారే లేకుండా పోయారు. ఈ కాలేజీకి ప్రిన్సిపల్ పోస్ట్ లేదు. కామర్స్ ఇంగ్లీషు సబ్జెక్టులకు మాత్రమే ఇద్దరు లెక్చరర్లు పనిచేస్తున్నారు. వీరిలో ఒకరు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. పక్కా భవనాలు ఉన్న ఈ ప్రభుత్వ కాలేజీని అభివృద్ధి చేయటంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ గ్రామంలో ప్రైవేటు జూనియర్ కళాశాలలకు అనుమతులు ఇవ్వటంలో చూపుతున్న శ్రద్ధ ప్రభుత్వ కాలేజీ పై చూపటం లేదనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. అభివృద్ధి లేని, విద్యార్థులు రాని ఈ కాలేజీని అభివృద్ధి చేయటం కోసం నాడు నేడు లో రూ.16 లక్షలు కేటాయించారు. ఈ కాలేజీలో హెచ్‌ఈసి, సిఈసి రెండు గ్రూపులు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఇద్దరు లెక్చరర్లలో ఒకరు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. అన్ని సబ్జెక్టులకు లెక్చరర్లను నియమించాలని కోరుతున్నా అధికారులు పట్టించు కోవడంలేదు.

ఈ కాలేజీ ఆడియో వీడియోగా ఉన్నప్పుడు టెక్నికల్ ఉద్యోగిని నియమించారు. రెగ్యులర్ కాలేజీ అయిన తర్వాత ఈ పోస్టు అవసరంలేదు. అయినప్పటికీ ఈ పోస్టును యధావిధిగా ఉంచారు. దీనిపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. ఈ పోస్ట్‌కు ఇచ్చే జీతంతో పలువురు లెక్చరర్లను నియమిస్తే విద్యార్థులు కాలేజీకి వచ్చే అవకాశం ఉందని మేధావులు అంటున్నారు. ఇవేవీ అధికారుల చెవికి ఎక్కటంలేదని విమర్శిస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు దారుణంగా ఉండటంతో ప్రజలంతా అవాక్కవుతున్నారు.

15న సిద్ధం సభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : ఈనెల 15న భీమవరంలో జరిగే ముఖ్యమంత్రి జగన్ తలపెట్టిన సిద్ధం సభను విజయవంతం చేయాలని వైకాపా ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ ఎంపీ మిథున్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం రెండవ పట్టణం లోని యూత్ క్లబ్‌లో చెరుకువాడ రంగనాథ రాజు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజలను చేరువయ్యే విధంగా సిద్ధం బస్సు యాత్ర కు ప్రజల నుండి మంచి స్పందన ఉందని, వైకాపా చేసిన అభివృద్ధిని చూసి తండోపతండాలుగా జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు తరలివస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ,ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్యే అభ్యర్థులు గుడాల గోపి, పివిఎల్ నరసింహారావు, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి, గూడూరి ఉమ బాల, తదితరులు పాల్గొన్నారు.

941 సాధించిన ప్రభుత్వ కాలేజి విద్యార్థి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల లో చదువుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీనివాస్ గౌడ శుక్రవారం తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ పరీక్షల్లో కె రవికుమార్ 1000 మార్కులకు 941 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ స్థానం నిలిచారన్నారు. సీఈసీలో యు. కృపా కర్ రాజు 1000కి 881 సాధించాడని ఎంపీ హెచ్ డబ్ల్యు లో కె.మహిత వెయ్యికి 899 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థిని కళాశాల లెక్చరర్, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు అభినందించారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మే నెలలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి బలపరచిన ఏలూరు ఎంపీ,చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థులను అధిక ఓట్లతో గెలిపించాలని వైసీపీ పోలవరం నియోజక వర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు ప్రజలను కోరారు. శుక్రవారం స్థానిక 3,4,5 వార్డుల్లో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి,పట్టణ వైసీపీ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య ఆధ్వర్యంలో చింతలపూడి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జెట్టి గురునాధరావు, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, మండవల్లి విజయసారధి, మేడవరపు విద్యాసాగర్ తదితర నాయకులు ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కు, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయ రాజుకు ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కాసర తులసి రెడ్డి,షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర -భీమవరం టౌన్: స్థానిక రెండవ పట్టణం లో వైసీపీ ఎన్నికల కార్యాలయాన్ని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వాసు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో భీమవరం వైసిపి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న గ్రంధి శ్రీనివాస్‌ను, ఎంపీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న గూడూరి ఉమా బాలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

నర్సాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల మాట్లాడుతూ భీమవరం రెండో పట్టణంలో ఎన్నికల కార్యాలయం ప్రారంభించడం సంతోషకరమని, ఎమ్మెల్యేగా గ్రంధి శ్రీనివాస్ ను, ఎంపీగా తనను గెలిపించడానికి ఈ ప్రాంత ప్రజలు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేడిది జాన్సన్, ఏఎస్ రాజు, అభిరుచి రఘు, గోకరాజు రామం, గాదిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అంశంపై క్షుణంగా అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-ఏలూరు: ర్యాండమైజేషన్ ప్రక్రియలో భాగంగా విధులు కేటాయించిన పివోలు, ఎపివోలు తప్పకుండా తమ బాధ్యతలను బాధ్యతా యుతంగా నిర్వహించాలని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యం. ముక్కంటి చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పివోలు, ఎపివోలకు పోలింగ్ నిర్వహణకు సంబంధించి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పూట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన థీయరి విభాగానికి 202 మంది హాజరు అయ్యారన్నారు. మధ్యాహ్నం కస్తూరిభా పాఠశాలలో ఈవిఎంల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు యం. ముక్కంటి తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ ఆయా అంశాలపై అవగాహన పెంచుకోవాలని, సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు. ఈవిఎంల వినియోగం, మాక్ పోలింగ్, ఇతర సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు తహశీల్దారు, ఎఆర్‌ఓ వి. మురార్జీ, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా

స్వతంత్ర అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే కలవపూడి శివ

విశాలాంధ్ర- కాళ్ళ : తాను శాసనసభ్యునిగా ఉన్న కాలంలో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని ఉండి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకట శివరామరాజు అన్నారు. మండలంలోని జువ్వలపాలెం, పెద్ద అమిరం గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాలు ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యేగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందని, రైతుల పక్షపాతిగా, ప్రతి ఒక్కరికి కుటుంబ సభ్యుడిగా ఏ కష్టం వచ్చినా ఆదుకున్నానని తెలిపారు. శివ స్వచ్ఛంద సేవ ద్వారా ఆరోగ్యం, విద్యకు సహాయం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా పలికిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే ఎన్నికలలో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోతో పేదలకు లబ్ది

విశాలాంధ్ర-మండవల్లి: టిడిపి మేనిఫెస్టోతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎన్డీఏ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ అన్నారు.మణుగూరు, కొవ్వాడ లంక గ్రామాలలో కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రజల సంక్షేమమే ప్రధానంగా టీడీపీ అధినేత తీసుకువస్తున్న సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఊరూరా తిరుగుతూ, ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. జగన్ పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరించి చెబుతున్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వేసవి తాగునీటి దాహార్తి లేకుండా చూసుకోవాలి

విశాలాంధ్ర-మండవల్లి: మండల పరిధిలో శుక్రవారం ఏలూరు జిల్లా జడ్‌పి సీఈవో, యస్‌ఈ (ఆర్డబ్ల్యూఎస్) వారు పర్యటించారు. ఈ సందర్భంగా లోకుమూడి గ్రామ పంచాయతీ పరిధిలో పోల్రాజ్ కెనాల్ నుంచి మంచినీటి చెరువులకు త్రాగునీటి అవసరాల నిమిత్తం నీటి విడుదల ఏర్పాట్లను పరిశీలించి, వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ అన్ని మంచినీటి చెరువులను నింపాలని తెలిపారు. ఈ నీటిని ప్రత్యేకంగా త్రాగు నీటి అవసరాలకే వాడుకోవాలన్నారు.ఎవరైనా చేపల చెరువులను నింపడానికి వాడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్. బేబీ శ్రీలక్ష్మి, లోకుమూడి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి విజయవంతం చేయండి

విశాలాంధ్ర-ఏలూరు: భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి స్వతంత్ర భారతదేశం మొదటి న్యాయ మంత్రి డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని తేదేపా ఎస్.సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎన్.డి.ఎ. కూటమి ఎం.పి. అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) లకు అంబేద్కర్ జయంతి వేడుకల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14వ తేదీన గత 19 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం 134వ జయంతి వేడుకలను టిడిపి ఏలూరు నియోజకవర్గ అభ్యర్థి బడేటి చంటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఆహ్వానం పలికిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, నగర ఎస్.సి సెల్ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, మూడో డివిజన్ మాజీ కార్పొరేటర్ జాలా సుమతి బాలాజీ,టిడిపి డివిజన్ అధ్యక్షులు చనపతి వెంకటరమణ, పొందూరు శంకర్రావు, బోస్ లోకేష్, మైనారిటీ సెల్ నాయకురాలు షేక్ రిజ్వానా సుల్తానా బేగం, వీరబత్తిన వనిత,జాలా అరుణ, వీరబత్తుల నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపుకోవాలి

విశాలాంధ్ర-ముదినేపల్లి : ఈ వేసవిలో ప్రధాన కాల్వ ద్వారా విడుదల చేసిన నీటిని మంచినీటి చెరువుల్లో పూర్తిగా నింపుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సత్య నారాయణ పేర్కొన్నారు. ముదినేపల్లి మండలంలోని పోలరాజ్ కాలువలో విడుదల చేసిన నీటిని కాలువ శివారు వరకు అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ పరివాహక గ్రామాలు మంచినీటితో చెరువులు వెంటనే నింపుకోవాలని నీటిని నింపుకోవడంలో అధికారులు అలసత్వం వహించారదన్నారు. ఎవరైనా ఈ నీటిని చేపల చెరువులకు, ఇతర చెరువులకు మరలిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలుపు మందు తాగి యువకుడి మృతి

విశాలాంధ్ర-టి నరసాపురం: కలుపు మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మక్కినవారి గూడెం గ్రామానికి చెందిన తడికిమళ్ళ చందు (25) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల చెడు వ్యసనాలకు బానిసవ్వడంతో తండ్రి వెంకటేష్ మందలించాడు. మనస్థాపం చెందిన చందు ఈ నెల 5వ తేదీన కలుపు మందు త్రాగాడు. కుటుంబ సభ్యులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించ డంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుండి విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 11వ తేదీన రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకటేష్ పిర్యాదుతో ఏఎస్ఐ జయ కుమార్ శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై కళాజాత

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఓటును ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని మండలంలో బోడిగూడెం గ్రామంలో కళాజాత కార్యక్రమం ద్వారా బోడిగూడెం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ఓటుకు హక్కుకు ఉన్నటువంటి ప్రాముఖ్యతను గురించి గ్రామస్తులకు తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలని ఓటు హక్కును వినియోగించుకోవడం తమ జన్మ హక్కు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.వి. శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: పద్దెనిమిదేళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు కావాలని పశ్చిమగోదావరి జిల్లా ఎన్నికల నోడల్ అధికారి జి సి హెచ్ ప్రభాకర్ కోరారు. శుక్రవారం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 18 సంవత్సరాల నిండిన యువతి యువకు లతో ఓటు హక్కు ఓటు నమోదుపై ప్రత్యేక కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, శ్రీ విజ్ఞాన వేదిక, కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ ఈ నెల ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అవ్వటమే కాకుండా ఓటు హక్కు కూడా వినియోగించుకోవాలని కోరారు .యువ ఓటర్లకు ఆన్లైన్లో ఓటర్ హెల్ప్ లైన్ డౌన్లోడ్ చేసుకొని ఆ విధంగా కూడా నమోదు అవ్వటానికి ఆస్కారం ఉందన్నారు. గత ఏడాది దేశవ్యాప్తంగా 67% ఓటింగ్ శాతం నమోదు కాగా ప్రస్తుత ఎన్నికల్లో కనీసం 75% స్థాయికి పెంచాలని ఆయన ఓటర్లను కోరారు. ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళి కృష్ణంరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ కృష్ణ చైతన్య, ఫిజికల్ సైన్స్ విభాగం హెడ్ డాక్టర్ ఎం.వి.సోమేశ్వరరావు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర-లింగపాలెం : లింగపాలెం మండలంలోని వేములపల్లి పంచాయతీలో ఆరుగురు, ముడిచెర్ల పంచాయతీలో ఒక వలంటీరు రాజీనామా చేశారు. తెదేపా అధినాయకుడు చంద్రబాబు, జనసేన అధినాయకుడు పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై చేస్తున్న అసందర్భ వ్యాఖ్యలకు నిరసనగా తాము రాజీనామా చేస్తున్నట్లు వీరు వెల్లడించారు. వీరి రాజీనామాలను లింగపాలెం మండల పరిషత్ అధికారులు ధ్రువీకరించారు.

విద్యార్థులు ఆంగ్ల భాషలో నైపుణ్యం సాధించాలి

విశాలాంధ్ర - కలిదిండి: విద్యార్థినీ విద్యార్థులు ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు టోఫెల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పి. ప్రభాకర్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు టోఫెల్ జూనియర్ పరీక్షలు నిర్వహించారు. 15 ప్రభుత్వ పాఠశాలలలో నిర్వహించిన టోఫెల్ పరీక్షలకు14 73 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. టోఫెల్ పరీక్షలలో ఉత్తీర్ణులైన వారికి అమెరికాకు చెందిన ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీస్ నుంచి టోఫెల్ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తుందని న్నారు. విద్యార్థులలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

తొమ్మిది మంది వలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలోని బందంచర్ల గ్రామంలో తొమ్మిది మంది వాలంటీర్లు మూకుమ్మడిగా మండల విస్తరణ అధికారి ఎం. రాంప్రసాద్‌కు శుక్రవారం రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు తమపై లేనిపోని ఆరోపణలు చేయడంతో మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు వారు తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా వృద్ధులు,వికలాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రతి పక్షాలు కుట్రలు చేసి తమ సేవలు అడ్డుకోవడం బాధాకరం అన్నారు. తమ సేవలు గుర్తించిన జగన్మోహనరెడ్డికి తోడుగా వుండి సార్వత్రిక ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

కలుపు మందుతాగి యువకుడి మృతి

విశాలాంధ్ర-టి నరసాపురం: కలుపు మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మక్కినవారి గూడెం గ్రామానికి చెందిన తడికిమళ్ళ చందు (25) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల చెడు వ్యసనాలకు బానిస వ్వడంతో తండ్రి వెంకటేష్ మందలించాడు. మనస్థాపం చెందిన చందు ఈ నెల 5వ తేదీన కలుపు మందు త్రాగాడు. కుటుంబ సభ్యులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుండి విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 11వ తేదీన రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకటేష్ ఫిర్యాదుతో ఏఎస్ఐ జయ కుమార్ శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాపులను నట్టేట ముంచిన ముద్రగడ

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం : తన స్వార్థ రాజకీయాల కోసం కాపులను ఉద్యమాల పేరుతో ఉసిగొల్పి నట్టేట ముంచింది ముద్రగడ కాదా అని గురువారం తాడేపల్లిగూడెం వచ్చిన ముద్రగడ ను కాపు నాయకులు పత్రికా సమావేశం ద్వారా నిలదీశారు. జనసేన నేత పవన్ కళ్యాణ్ పై కాపు ద్రోహి గా ముద్రవేసి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని తాడేపల్లిగూడెం కాపు నాయకులు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం లోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం కాపు నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపు ఉద్యమం పేరుతో కాపులకు ఏదో చేస్తారని నమ్మకంతో కాపులంతా ముద్రగడ వైపు వెళ్తే వారికి మిగిలింది కేసులు తప్ప ఏమీ లేవన్నారు.కాపులపై ప్రేమ, గౌరవం ఉంటే భేషరతుగా పవన్ కళ్యాణ్ కు సపోర్ట్ చేయాల్సింది పోయి జగన్ వేసే రాజకీయ ముష్టి కోసం పాకులాడారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు అడబాల నారాయణమూర్తి, గుండమోగల సురేష్,రామిశెట్టి సురేష్, యడ్లపల్లి శ్రీరామ్,అంబటి కృష్ణ,గట్టు గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళిత నాయకునికి నివాళులు

విశాలాంధ్ర-లింగపాలెం: టి సి హెచ్ ఆర్ పాలెం లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన దళిత నాయకుడు లక్క పాము సుందరం కుటుంబాన్ని లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగ సందీప్ పరామర్శించారు.

గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెద్దగా విద్యాభ్యాసం లేకపోయినప్పటికీ దళితుల సమస్యలపై పోరాడుతూ వారి అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈయన సేవలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈయన కుమారులలో ఒకరు ఆర్.సి.యం గురువుగా పనిచేస్తున్నారు. ఈయన ప్రస్తుతం యూరప్‌లో రోమన్ క్యాథలిక్ గురువుగా పనిచేస్తున్నారు. మృతి చెందిన సుందరం చిత్రపటానికి లిడ్ క్యాప్ డైరెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నంది పాము యేసు రత్నం, ముళ్ళపూడి సుమన్, పింగుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత,, క్రమశిక్షణ గల నాయకుడు రామకృష్ణ

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: సమయం రామకృష్ణ యూనియన్ పట్ల పూర్తి నిబద్ధత క్రమశిక్షణ గల నాయకులని, బ్యాంకులో కూడా అదే క్రమశిక్షణతో పనిచేసి ఖాతాదారుల మన్ననలు పొందారని బ్యాంకు యూనియన్ నాయకులు పేర్కొంటూ వారికి జోహార్లు తెలిపారు . బుధవారం రాత్రి మరణించిన సమయం రామకృష్ణ మరణానికి సంతాపం తెలుపుతూ తాడేపల్లిగూడెంలో యూనియన్ సీనియర్ నాయకులు సిద్దాబత్తుల సూర్యనారాయణ, కోఆర్డినేషన్ కమిటీ సీనియర్ నాయకులు ఎస్ ఎస్ ప్రసాద్, ఏపీ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి టీవీ సూర్యనారాయణ, ఆంధ్రాబ్యాంకు యూనియన్ నాయకులు పాలూరి సత్యనారాయణ, వి.సురేష్ కుమార్, ఎం. రత్నప్రసాద్, జె. రత్నరాజు యూనియన్ సహాయ రీజనల్ కార్యదర్శి బి. దివ్య రజని, లింగంపల్లి గాంధీ, బ్యాంకు అఫ్ ఇండియా యూనియన్ సహాయ కార్యదర్శి బి.ఏడుకొండలు సంతాప సందేశంలో పేర్కొన్నారు. రామకృష్ణ పనివిధానం ఆదర్శం, ఆచరణీయమని వారు తెలిపారు.తాడేపల్లిగూడెం బ్యాంకు ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ వ్యవస్థాపకులలో రామకృష్ణ ఒకరని, 1968-69 ప్రాంతంలో- నాటి నాయకులతో కలిసి బ్యాంకుల జాతీయకరణ పోరాటాలలో పాల్గొన్నారని వారు గుర్తు చేశారు.యూనియన్ కార్యక్రమాలలో కొత్త తరానికి ఆయన మంచి మార్గదర్శకత్వం చేసేవారని పేర్కొన్నారు. అధికారులు,సిబ్బంది అందరికీ తలలో నాలుకలా ఉండేవారని వారు పేర్కొన్నారు. రిటైర్ అయిన తర్వాత కూడా ఆక్టివ్ గ వుండే వారని, వారి మృతి ఆంధ్ర బ్యాంకు (యూనియన్ బ్యాంకు) యూనియన్ కు, కోఆర్డినేషన్ కమిటీ కి తీరని లోటని వారికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఐఎన్‌టిఎస్ఓ ఫలితాలలో శ్రీచైతన్య విద్యార్థులకు బంగారు పతకాలు

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక శాంతినగర్ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన ఐ ఎన్ టి ఎస్ ఓ (సెకండ్ లెవెల్) ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను కన బరిచి, తమ సత్తా చాటారని , లాప్టాప్ , ట్యాబ్ లతో పాటు 169 మంది విద్యార్థులు బంగారు పతకాలను, ప్రశంసా పత్రాలను సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. శివకుమారి తెలిపారు.

ఈ సందర్భంగా గ్రాండ్ బహుమతి (లాప్టాప్) సాధించిన చి. కంకర్ల డీన్ పాల్ తో సహా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విజేతలను శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుంకర పార్థసారథి, రీజినల్ ఇంఛార్జి సిహెచ్. ఉదయభాస్కర్, జోనల్ అకడమిక్ డీన్ జె. సంజీవ్ కుమార్, ప్రైమరీ ఇంచార్జ్ నరీనా, ఎగ్జామ్ ఇన్చార్జెస్ సి.హెచ్. కమలావతి, ఎం.జయశ్రీ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

రష్మిక మందన్నతో "సువర్ణ అవకాశం" పోటీ గ్రాండ్ ఫైనల్‌ను నిర్వహించిన టాటా టీ చక్ర గోల్డ్

విశాలాంధ్ర-ఏలూరు: దక్షిణ భారతదేశంలో రెండవ అతిపెద్ద టీ బ్రాండ్, టాటా టీ చక్ర గోల్డ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో గత 90 రోజులుగా ఎంతో ఆసక్తిగా నిర్వహిస్తున్న సువర్ణ అవకాశం పోటీని ఈ రోజు బ్రాండ్ అంబాసిడర్ రష్మిక మందన్న సమక్షంలో ముగించింది. "సువర్ణ అవకాశం" కార్యక్రమం ఇంగ్లీషులో "గోల్డెన్ ఆపర్చునిటీ" గా అనువదించే ఈ పోటీ కేవలం టీ వేడుక మాత్రమే కాదుబీ ఇది అద్వితీయమైన క్షణాలు, ఆహ్లాదకరమైన రుచులు మరియు ఊహించని రివార్డ్‌ల యొక్క సంపూర్ణ సమ్మేళనంగా ఆనందాన్ని అందిస్తుందని టాటా కన్స్యూమర్ ప్రోడక్ట్స్ ప్యాకేజ్డ్ బెవరేజెస్, ఇండియా, సౌత్ ఏషియా, టాటా కన్స్యూమర్ ప్రోడక్ట్స్ అధ్యక్షులు పునీత్ దాస్ తెలిపారు. వినియోగదారులు టాటా టీ చక్ర గోల్డ్ యొక్క ఏదైనా ఆఫర్ ప్యాక్‌ని కొనుగోలు చేయడం ద్వారా మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ప్యాక్‌లో ఉన్న ప్రత్యేకమైన కోడ్‌ను చెప్పటం లేదా ప్యాక్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా పోటీలో పాల్గొనవచ్చు, ఇది సౌకర్యవంతమైన అనుభవాన్ని అందిస్తుందన్నారు. సువర్ణ అవకాశం పోటీ యొక్క ముగింపు లో భాగంగా 25 మంది ఉత్సాహభరితమైన విజేతలను ఒకచోట చేర్చిందని, వారు అతిథులతో కలిసి, చక్కటి నటన, అందం గురించి తరచుగా గుర్తుచేసుకునే నటిని కలుసుకున్నారన్నారు. టాటా టీ చక్ర గోల్డ్ నిర్వహించిన ఈ కార్యక్రమం, విజేతలకు రష్మిక మందన్నను వ్యక్తిగతంగా కలుసుకునే చిరస్మరణీయమైన అవకాశాన్ని అందించిందని, రష్మికతో నిర్వహించిన ఆకర్షణీయ మైన మీట్ గ్రీట్ సెషన్‌తో పాటు, టాటా టీ చక్ర గోల్డ్ 500 మంది అదృష్టవంతులైన విజేతలకు అద్భుతమైన బంగారు నాణెములను కూడా అందించిందని చెప్పారు.

వైసీపీలో చేరికలు

విశాలాంధ్ర-భీమవరం టౌన్ : భీమవరం నియోజకవర్గ అభివృద్ధి చూసి వైకాపాలో చేరుతున్నారని ప్రభుత్వ విప్, గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. పట్టణానికి చెందిన 13 వార్డులకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు, మాజీ టీడీపీ కౌన్సిలర్ సీసలి రాజేశ్వరిలు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసీపీలో చేరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో నాడు నేడు కూడా అభివృద్ధి తన హయాంలోనే జరిగిందని స్పష్టం చేశారు. తన హయాంలోనే 82 ఎకరాల భూమిని సేకరించినట్టు తెలిపారు. ఆ భూమిలోనే టిడ్కో గృహాలను నిర్మించినట్టు పేర్కొన్నారు. లబ్దిదారులకు ఈ గృహాలను అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో డి సి ఎం ఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, నందమూరి ఆంజనేయులు, పాలవెల్లి మంగ, అల్లూరి నాగవల్లి, కానుబోయిన వెంకటరమణ, వేండ్ర విజయదుర్గ, చినమిల్లి వెంకటరాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకులు పరసా శ్రీనుకు ప్రాధాన్యత ఏది?

విశాలాంధ్ర -చాట్రాయి : బీసీ గర్జన సభలో 30 ఏళ్లుగా చిల్లిగవ్వ ఆశించకుండా తెలుగు దేశం పార్టీకి అనునిత్యం పూర్తి కాలం కార్యకర్త లా పనిచేస్తున్న బీసీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ నాయకులు పరసా శ్రీనివాసరావును వేదిక మీదకు పిలవకపోవడం చర్చనీయాం శంగా మారుతోంది.

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జనాభాలో అత్యధిక శాతంగా వున్న బలహీనవర్గాలలో గ్రామస్థాయిలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడం కోసం ప్రజలకు దగ్గరగా వెళ్లడం కోసం ప్రారంభించిన బీసీ గర్జన సభలో కూడా వేదిక మొత్తం ఓసీలతోనే నిండిపోయి బిసిలకు అది చేశాం ఇది చేశామని పెద్ద పెద్ద గొంతులతో ఆవేశపూరితంగా ప్రసంగాలు చేస్తున్నారు కానీ చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో బలహీన వర్గాల రజక సామాజిక తరగతికి చెందిన పరసా శ్రీనివాసరావు ఇస్త్రీ చేస్తూ కుటుంబ జీవనం సాగిస్తూ గడచిన 30 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో అంకిత భావంతో పని చేసే వ్యక్తిని కనీసం వేదికపైకి పిలవని పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకమైంది.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

విశాలాంధ్ర -భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి బీసీలంతా విశేషకృషి చేయాలని ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపు నర్సాపురం పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాల్లో జయహో బిసి సదస్సులు విజయవంతంగా నిర్వహించాలని

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో బిసి నాయకులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మద్యాన్ని నిషేధిస్తానని అధికారంలోకి వచ్చిన జగన్ తన ప్రభుత్వం ద్వారా నాసిరకం మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల మరణాలకు అనారోగ్యానికి కారణమయ్యారని అన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్య రాజు, గూడూరి సుబ్బారావు, నాయకులు బొక్క చంద్రమోహన్, గూడూరి రామకృష్ణ, పామర్తి వెంకటరామయ్య, క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

అపోలో జూనియర్ కాలేజీ విద్యార్థులకు మండల, రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అపోలో జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యధిక మార్కులతో మండల స్థాయి/ స్టేట్ ర్యాంక్ లు సాధించారని అపోలో విద్యాసంస్థల కరస్పాండెంట్ ఆర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఎన్ . ఇందు ఎంపీసీ ద్వితీయ సంవత్సరం 984/1000 మండల ఫస్ట్, స్టేట్ ర్యాంక్ సాధించిందని,ఆర్. నివేదిత బైపిసి ద్వితీయ సంవత్సరం 949/1000 మండల ఫస్ట్, వై. ఇంద్రాణి ప్రథమ సంవత్సరం 461/470 మండల ఫస్ట్ మార్కులు సాధించారని అత్యుత్తమ మార్కులతో ఇంటర్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత ను సాధించామని అపోలో విద్యా సంస్థల కరస్పాండెంట్ ఆర్.ప్రవీణ్ కుమార్, విద్యా సంస్థల చైర్ పర్సన్ ఆర్. శ్రీవిద్య తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇన్చార్జి ఆచంట రవి, ఝాన్సీ లక్ష్మి, రాధాకృష్ణ, కామాక్షి ,కృప తదితర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఐఎన్‌టిఎస్ఓలో సత్తా చూపిన జంగారెడ్డిగూడెం శ్రీచైతన్య విద్యార్థులు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన ఐఎన్‌టిఎస్‌ఓ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారులు బుద్ధుల రాముడు, బి. రాములు విద్యార్థులకు

బహుమతి ప్రదానం చేసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థికి వేరువేరు విభాగములలో బహుమతులు సాధించడం గర్వకారణమన్నారు. దీనికి చైతన్యలో జరుగు ప్రతిష్టాకత్మకమైన టెక్నో, సి బ్యాచ్ సిలబస్ కారణమని తెలిపారు. టాబ్ ప్రథమ బహుమతిగా పొందిన ఎ. గీతికను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం పి.పార్థసారధి ,ఆర్ ఐ సి హెచ్ ఉదయ భాస్కర్, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఏవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ క్యాంపు

విశాలాంధ్ర-పాలకోడేరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ క్యాంపు పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో శుక్రవారం పాలకోడేరు పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ రంగం నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ క్యాంపునకు సుమారు 350 మంది రోగులు హాజరయ్యారు.

వచ్చిన ప్రతి ఒక్కరిని పరీక్షించి అవసరమైన వారికి రక్త పరీక్షలునిర్వహించి,మందులుపంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఓ సత్యనారాయణ, హెల్త్ సూపర్వైజర్లు, పి హెచ్ ఎన్, హెచ్ వి లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎల్ టీ, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెలుగుదేశం జనసేన బిజెపి కూటమిల ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్, పోలవరం అభ్యర్థి చిర్రి బాలరాజుల సైకిల్, గ్లాస్, గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి పేర్కొన్నారు. మండలంలో పరింపుడి గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ

కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ మేనిఫెస్టో ద్వారా కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు దొడ్డపనేని దుర్గాదేవి, నల్లపర్తి ఝాన్సీ రాణి, కొత్త రమ, సిర్ర ఉమా,కర్రీ దేవి,గ్రామ మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెండవ గ్రోసరీ ఫుల్ ఫిల్మెంట్ కేంద్రాన్ని ప్రారంభించిన ఫ్లిప్‌కార్ట్

విశాలాంధ్ర-రాజమండ్రి: భారతదేశంలోని స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్ ప్లేస్ ఫ్లిప్‌కార్ట్ విశాఖపట్నంలో తన కిరాణా ఫుల్ ఫిల్మెంట్ కేంద్రాన్ని ప్రారంభించడం ద్వారా తమ కార్యకలాపాలను విస్తరించిందని హెరిటేజ్ ఫుడ్స్ సీఈఓ శ్రీదీప్ కేశవన్, ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్, ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ హెడ్, వైస్ ప్రెసిడెంట్ హరి కుమార్ తెలిపారు. స్థానిక వినియోగదారులకు మరుసటి రోజు కిరాణా డెలివరీలను అందిస్తోందన్నారు. ఫ్లిప్‌కార్ట్ తమ స్థానిక వినియోగదారుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, ఫ్రీడమ్ హెరిటేజ్ వంటి ప్రముఖ ప్రాంతీయ బ్రాండ్ల క్యూరేటెడ్ శ్రేణిని అందిస్తుందని, అలాగే డైరీ, గుడ్లు, చాక్లెట్లు, స్టేపుల్స్, క్లీనింగ్ ఎయిడ్స్ మరిన్ని వంటి వర్గాల నుండి 6,000 కంటే ఎక్కువ ఉత్పత్తులను అందిస్తుందన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇ-కామర్స్ గమ్యస్థానాలలో విశాఖపట్నం ఒకటనీ ఆన్లైన్ కిరాణా సామాగ్రి కోసం ప్రధాన మార్కెట్ గా వెలుగొందుతుందన్నారు. ఇది విజయవాడ తర్వాత రాష్ట్రంలో రెండవ గ్రోసరీ ఫుల్ ఫిల్మెంట్ కేంద్రం అని చెప్పారు. ఈ కొత్త ఫుల్ ఫిల్మెంట్మె సెంటర్ దాదాపు 77,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందన్నారు. అనకాపల్లి, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం విజయనగరంతో పాటు విశాఖపట్నంలో రోజుకు 8,000 ఆర్డర్లను ఇది ప్రాసెస్ చేయగలదని చెప్పారు. ఈ ప్రాంతంలోని అనేక చిన్న వ్యాపారాలు, ఎంఎస్ఎంఈ, స్థానిక రైతుల జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా ఇది దాదాపు 1,000 ప్రత్యక్ష పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టించ నుందని తెలిపారు.

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాపు

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో 2024, ఏప్రియల్ 12 మరియు 13 తేదీలలో కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం మరియు టెక్నిక్స్, ఐఐటి, వారణాసి వారి సంయుక్త ఆధ్వర్యంలో "అడ్వాన్స్ ఆటోమొబైల్ మెకానిక్స్ "అనే అంశంపై వర్కుషాప్ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శశాంక్

పాట్లోళ్ల, కార్పొరేట్ ట్రైనర్, టెక్నిక్స్, ఐఐటి, వారణాసి వారు విచ్చేసారని, కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ, ఇటువంటి సాంకేతిక కార్యక్రమాలను నిర్వహించడంలో తమ కళాశాల ఎప్పుడూ ముందుంటుందని, వాటి ద్వారా విద్యార్థులు అనేక సాంకేతిక నైపుణ్యాలను, నూతన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలియజేసారు. అనంతరం ముఖ్య అతిధిగా విచ్చేసిన శశాంక్ పాట్లోళ్ల, మాట్లాడుతూ, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో నేడు, రేపు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అడ్వాన్స్ ఆటోమొబైల్స్ టెక్నాలజీ నేర్చుకోవడం ద్వారా కలిగే నూతన అవకాశాలను మరియు ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, వివిధ విభాగాధిపతులు, కార్యక్రమ కో ఆర్డినేటర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి విజయాలు సాధించినట్లు చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్

కిషోర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరిచి ఈ విజయాలు సాధించాను అన్నారు. ఈ పోటీలలో కె. హరిప్రియ గ్రాండ్ ప్రైజ్‌కు లాప్టాప్ ఫస్ట్ ప్రైజ్ ఐ సోనీ ట్యాబ్ గోల్డ్ మెడల్స్ 140 వారికి స్మార్ట్ వాచీలు కన్సోలేషన్ ప్రైజ్ 48 స్పెషల్ ప్రైజులు ఆరు మెరిట్ ప్రైస్ లు 4 0 0 సాధించినట్లు తెలిపారు. మొత్తం 6 05 ప్రైజులు సాధించినట్లు కిషోర్ తెలిపారు. బహుమతులు దేవరపల్లి సీఐ సురేష్ బాబు ఎస్సై కే శ్రీ హరిరావు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉదయభాస్కర్, ఏజీఎం పార్థసారథి పాల్గొన్నారు.

ఘనంగా అచ్చిబాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -కొవ్వూరు : కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు ఆంధ్ర షుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) పుట్టినరోజు వేడుకలు దొమ్మేరు అయన స్వగృహం లో ఘనంగా జరిగాయి.

ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వర రావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమని రామకృష్ణ,, పొట్రు శ్రీను, గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్ది పాటి వెంకట రాజు, గోపాలపురం జనసేన ఇంచార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు, పోలవరం మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస రావు ,కొవ్వూరు జనసేన ఇంచార్జి టీవీ రామ రావు, పట్టణ జనసేన అధ్యక్షులు దేగలరాము, గంగుమళ్ల స్వామి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కాకర్ల సత్య నారాయుడు, తెలుగుదేశం నాయకులు కలగర రంగా రావు, కొవ్వూరు నియోజక వర్గం నుంచి టీడీపీ -జనసేన -బీజేపీ పార్టీల నాయకులూ కార్యకర్తలు అధిక సంఖ్య లో పాల్గొని కేక్ కటింగ్ చేసి,పుష్ప గుచ్చాలతో, పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియ చేశారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో కళాశాలలు పోటాపోటీ

విశాలాంధ్ర - సీతానగరం: ఇంటర్మీడియట్ ఫలితాలలో కళాశాలలు పోటాపోటీ పడ్డాయి. మండల వ్యాప్తంగా ఒక ప్రభుత్వ, రెండు ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి.

దీనిలో సీతానగరం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ 2వ సంవత్సరం 87 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 65 మంది ఉత్తీర్ణులు అయ్యారు. దీనిలో 1000కి పి.ధర్మరాజు 939, సి ఎచ్ ప్రశాంతి 895 మార్కులతో కళాశాల మొదటి, రెండవ స్థానాలను సాధించారు. రఘుదేవపురం గ్రామంలోని సత్య ప్రభా కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 50కి 32 మంది, రెండవ సవంత్సరం 48 కి 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. వీరిలో కె వెంకన్న బాబు 972 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానం సాధించాడు. చినకొండేపూడి గ్రామంలో గల సూర్య చంద్ర అకాడమి జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 17 కి 17 మంది, రెండవ సంవత్సరం 24 కి 22 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. వీటిలో మొదటి 470 మార్కులకు 442 సాధించగా రెండవ సంవత్సరం 899 మార్కులు సాధించారు.

ఎపిపిఎస్ఇ గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో 9 మంది ఉత్తీర్ణత

విశాలాంధ్ర-బుట్టాయిగూడెం: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ కె.ఆర్.పురం ఆధ్వర్యంలో వై.టి.సిలో 25 రోజులు ఉచిత శిక్షణ పొందిన 70 మందిలో ఇటీవల ఎపిపిఎస్ఇ నిర్వహించిన గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో 9 మంది ఉత్తీర్ణత పొందడం అభినందనీయమని కె.ఆర్.పురం ఐటిడిఎ పివో యం. సూర్యతేజ తెలియజేశారు.

జనవరి 27, 2024 నుంచి ఫిబ్రవరి,24వ తేదీ వరకు 25 రోజులు వై.టి.సి నందు 70 మందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఇటీవల గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో 9 మంది ఉత్తీర్ణత పొందారని, ఇదే స్పూర్తితో గ్రూప్-2 మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగాలు పొందాలని పివో ఐటిడిఎ ఆకాంక్షించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే శాంతిభద్రతలు

విశాలాంధ్ర-కొవ్వూరు : కాంగ్రెస్ పార్టీ ద్వారానే దేశంలోనూ రాష్ట్రంలోనూ శాంతిభద్రతలు నెలకొంటాయని రాజమండ్రి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన ప్రచారాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొవ్వూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అరిగెల అరుణకుమారితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు

అంతకుముందు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వేంచేసి ఉన్న వాసవి మాత అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరుణ్ కుమారి మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రానికి దక్కాల్సిన ప్రత్యేక హెూదా విశాఖ రైల్వే జోన్ పోలవరం ప్రాజెక్టు పూర్తి వంటి అంశాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గంధం బాబ్జి పిసిసి సభ్యులు గడ్డం సాయిబాబా జిల్లా ఉపాధ్యక్షులు కొటిదెల శ్రీనివాస్, ప్రభాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి సమాధి కట్టాలి

విశాలాంధ్ర - కరప : వైసీపీకి సమాధి కట్టాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు పేర్కొన్నారు. కరప మండలం వలసపాకుల గ్రామంలో ఎన్డీఏ కూటమికి ఓటు వేయాలని పంతం నానాజీ కుమారుడు సందీప్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వై పండు, భోగి రెడ్డి గంగాధర్ భోగి రెడ్డి కొండబాబు, కాకర్ల బుజ్జిబాబు, మహేంద్ర బాబు, సింహాద్రి, గుళ్ళపల్లి శ్రీనివాసరావు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో 54 శాతం ఉత్తీర్ణత

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం విడుదలైన ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉండ్రాజవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్, బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు కె. ఎస్.కె. మాణిక్యాలరావు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

గత విద్యా సంవత్సరంలో ప్రారంభమైన కళాశాలలో మొత్తం 13 మంది విద్యార్థినిలు జూనియర్ ఇంటర్ పరీక్షలు వ్రాసినట్లు ఆయన తెలిపారు. వీరిలో ఏడుగురు ఉత్తీర్ణులై 54 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీ.ఈ.సీ. లో 10 మందికి గాను 6 మంది, ఎం.పీ.సీ. గ్రూపులో 3 మందికి గాను ఒకరు ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం చెప్పారు. సీ.ఈ.సీ గ్రూపులో గున్నేపల్లి తన్విక 500 మార్కులకు గాను 371 మార్కులు పొంది 74 శాతం తో ప్రథమ స్థానం సాధించగా, ఎం.పి.సి. నుండి ఎం.బి.డి. శిరీష 470 మార్కులకు గాను 405 మార్కులతో 86 శాతం సాధించి, ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

భేటీ బచావో భేటీ పడావోపై అవగాహన

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ఐ.సి.డి.ఎస్ సీడీపీఓ మమ్మీ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన తాళ్ళపూడిలో కిషోర్ బాలికలకు భేటీ బచావో భేటీ పడావోపై అవగాహన కార్యక్రమాన్ని తాళ్ళపూడి జెడ్పి.ఎచ్.స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.సి. డి.ఎస్ సూపర్ వైజర్ భాగ్యకుమారి మాట్లాడుతూ కౌమార దశలోకి వచ్చిన

ఆడపిల్లలు ప్రవర్తన ఎలా ఉండాలి, వారు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లను వివరించారు. బాడ్ టచ్, గుడ్ టచ్ గురించి ఆడపిల్లలకు తెలియ పరిచారు. పి.ఎచ్.సి హెల్త్ ఎడ్యుకేటర్ భాగ్యలక్ష్మి స్కూల్ ప్రధానోపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు సుజాత తదితరులు హాజరయ్యారు.

ఎకరాకు 50 బస్తాలు దిగుబడి పంట కోత ప్రయోగం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్ళపూడి మండలం లోని వేగేశ్వరపురం గ్రామంలో రైతులు బుద్దాల సురేష్ మరియు వనమల వీరబాబు పొలాలలో రెండు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. కొవ్వూరు ఉపగణాంక అధికారి పి.సోమరాజు సూపర్వైజర్‌గా ప్రయోగాలను పరిశీలించారు. పి.ఆర్ 126 పంట దిగుబడి అత్యధికంగా 50 బస్తాలు పండిందని తెలియజేశారు. 340 1/3 లో వనమాల వీరబాబు పొలంలో ఎంటీయూ 1121 రకం కూడా బాగా పండిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ గణాంక అధికారి జోడాల వెంకట్ మాట్లాడుతూ సరైన సమయంలో మందులు వాడుతూ శ్రద్ధ తీసుకోవటం వలన బుద్దాల సురేష్ 50 బస్తాలను పండించారని కొనియాడారు. వీరితో పాటు వ్యవసాయ సహాయకులు పోసమ్మ, ఇన్సూరెన్స్ ఏజెంట్ పోసిబాబు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'సాయిదీప్తి' విజయకేతనం

విశాలాంధ్ర - మామిడికుదురు : నగరంలోని "సాయిదీప్తి" ఐఐటీ, మెడికల్ అకాడమీకి చెందిన ఇంటర్ విద్యార్థులు శుక్రవారం విడుదలైన ఫలితాల్లో విజయఢంకా మోగించినట్లు దీప్తి విద్యా సంస్థల చైర్మన్ డివివి సత్య నారాయణ తెలిపారు. జూనియర్ ఇంటర్లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను నల్లా హారికచంద్ర 461 మార్కులు,

సీనియర్ విభాగంలో 1000 మార్కులకు చిట్టినీడి మీనా 976 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. సీఈసీలో దొమ్మేటి భాగ్యశ్రీ 500 కుగాను 456, ఎంపీసీలో 470కి కడి నాగరమ్య 457, డి శ్రావణి 449 మార్కులు సాధించారన్నారు. ఈ మార్కులు కోసం కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్ జక్కంపూడి శివ ప్రసాద్‌ను, అధ్యాపకులను, విద్యార్థుల తల్లిదండ్రులను, విద్యార్థులను చైర్మన్ డీవీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

జోగేశ్వరరావు గెలుపునకు కృషి చేయండి

చంద్రబాబు పిలుపు

విశాలాంధ్ర - అమలాపురం : మండపేట నియోజవర్గంలో టిడిపి అభ్యర్థి వేగుళ్ళ జోగేశ్వరరావును మారుస్తున్నారన్న ప్రచారం పక్షం రోజులుగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. ఈ నేపథ్యంలో అమలాపురంలోని కిమ్స్‌లో టిడిపి అధినేత చంద్రబాబు వద్దకు జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలా కృష్ణ, మండపేట టిడిపి అభ్యర్థి వేగుళ్ళ జోగేశ్వరరావులు శుక్రవారం వెళ్లి కలిశారు.

శుక్రవారం విశాలాంధ్రలో వేగుళ్లను మారుస్తున్నారా శీర్షికన ప్రచురితమైన వార్త మండపేటలో ప్రకంపనలు సృష్టించింది. దీనితో వేగుళ్ల అమలాపురంలో ఉన్న చంద్రబాబు వద్దకు పరుగులు తీశారు. అక్కడ వారిద్దరితో చంద్రబాబు భేటీ అయ్యారు. అనంతరం మండపేట నుండి నాలుగోసారి మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అసెంబ్లీకి పోటీ చేస్తున్నారని చంద్రబాబు స్పష్టం చేశారు. దీనిపై పూర్తి క్లారిటీని అటు పార్టీ వర్గాలకు ఇటు ప్రజలకు చంద్రబాబు ఇచ్చారు. దీంతో ఈనెల 20న వేగుళ్ళ జోగేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేయడానికి పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారని సమాచారం.